దూపాడును కాలుష్యం నుంచి కాపాడండి

- కల్లూరు తహశీల్దార్ కార్యాలయం దిగ్బంధం
- కెవి.సుబ్బారెడ్డి, అశోక ఇంజినీరింగ్ కళాశాలల మురుగునీటి నుంచి ప్రజలను కాపాడాలి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండల తహశీల్దార్ కార్యాలయాన్ని దూపాడు గ్రామ ప్రజలు సిపిఎం ఆధ్వర్యంలో 5 గంటల పాటు తహశీల్దార్ కార్యాలయాన్ని సోమవారం దిగ్బంధం చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చి సమస్యను వివరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ, మండల కార్యదర్శి కృష్ణ, మండల నాయకులు మధు మాట్లాడారు. కల్లూరు మండలం దూపాడు గ్రామంలో సుమారు 300 కుటుంబాలు ఉన్నాయన్నారు. గ్రామాన్ని కార్పోరేషన్‌లో విలీనం చేశారని, కనీస సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈనేపథ్యంలో కెవి సుబ్బారెడ్డి , అశోక్ మహిళా ఇంజనీరింగ్ కాలేజీల బాత్రూంలోని నీళ్ళ, టాయిలెట్స్ నీళ్ల హంద్రీ నదిలోకి వదిలి (రింగు బావి దగ్గర) కలుషితమయ్యాయని తెలిపారు. గ్రామ ప్రజలను పూర్తిగా అనారోగ్యాల పాలు చేస్తున్నారని తెలిపారు. గ్రామ ప్రజలు నిత్యం వాంతులు, విరోచనాలు, విషజ్వరాల బారినపడి అనారోగ్యం పాలవుతున్నారన్నారు. భయభ్రాంతులకు గురవుతూ ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అనేకమార్లు అధికారులకు విన్నవించినా స్పందించడం లేదన్నారు. దీని వెనకాల ఉండే రహస్యం ఏమిటో గ్రామ ప్రజలకు అర్థం కావడం లేదన్నారు. కనీసం మంచినీటిని కూడా నోచుకోలేక కార్పొరేట్ కాలేజీలు వదిలిన మురుగు నీటిని తాగాల్సి దుస్థితి గ్రామ ప్రజలకు పట్టిందన్నారు. ఇదేనా ప్రజా ప్రభుత్వం అంటూ నిలదీశారు. ప్రజలను పక్కదారి పట్టించడం, మోసం చేయడం అంతేకాదు కొంతమందిని ప్రలోభ పరుచుకొని తమ కాలేజీలో మురుగునీళ్ల నదిలోకి పంపుతున్నారని తెలిపారు. పైగా ఫిల్టర్ నీళ్ల అందిస్తామని చెబుతున్నారన్నారు. హంద్రీనదిలో మాకు ఉన్న సురక్షితనీరు వదులుకోవడానికి సిద్ధంగా లేమని గ్రామ ప్రజలందరూ ముక్తకంఠంతో చెప్పాలని కోరారు. సమస్య పరిష్కారం కానీ ఎడల సిపిఎం గ్రామ ప్రజల పెద్ద ఎత్తున ఉద్యమానికి పూనుకుంటారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆందోళనకు సంఘీభావం తెలిపింది. ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా అధ్యక్షులు అబ్దుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు సాయిఉదయ్, హరిబాబు, దూపాడు గ్రామ ప్రజలు షేక్షావలి, ఈశ్వర్, వినోద్, గాలెన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

కర్నూలు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి

- కలెక్టరేట్ ఎదుట పిపిఎస్ఎస్ ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలులో చెత్తసేకరణ క్లాపు వాహనాలు సీజ్ కావడంతో పాటు మున్సిపల్ వాహనాలు కూడా మరమ్మతుల గురి కావడంతో పేరుకుపోయిన చెత్తను తీసుకువెళ్లేందుకు ఇబ్బందిగా మారిందని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి అన్నారు. వెంటనే కర్నూలులో పారిశుధ్య సమస్యను పరిష్కరించేందుకు కలెక్టర్ జోక్యం చేసుకొని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎస్ రమణ గౌడ్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో రాష్ట్ర నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, అన్వర్‌బాష, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు టి.మద్దిలేటి, ఎం.సుమలతలు మాట్లాడారు. ప్రైవేటు కాంట్రాక్టర్ రెడ్డి ఏజెన్సీకి చెందిన 90 క్లాప్ ఆటోలను ఫైనాన్స్ సంస్థలు సీజ్ చేశాయన్నారు. 20 మున్సిపల్ వాహనాలు మరమ్మతులకు గురికావడం వల్ల గత పది రోజులుగా చెత్తను చేరవేసే వాహనాల కొరత ఏర్పడి రోడ్ల పైన, కాలువల్లో, ఖాళీ ప్లాట్లలో చెత్త పేర్కొనిపోయి దుర్వాసన, దోమల బెడదతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ప్రభుత్వ స్పందించి 100 మినీ వాహనాలను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. క్లాప్ఆటో కార్మికుల ఉపాధిని కాపాడాలన్నారు. నగరపాలక సంస్థ క్లాప్ డ్రైవర్ల సంఘం నాయకులు ఎస్ షఫీ, వై.గురు శేఖర్, సూపర్వైజర్లు కె.అయ్యస్వామి, వి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ 8 నుండి 18 నెలల జీతాలు రాక పస్తులు ఉంటున్నామని తెలిపారు. రెడ్డి ఏజెన్సీ పిఎఫ్ ఇఎస్ఐ కూడా సక్రమంగా చెల్లించలేదని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని బకాయి జీతాలు ఇప్పించడంతోపాటు ఉపాధిని కాపాడాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ ను కలిసి వారు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత అధికారులతో చర్చించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఎస్.రాజేష్, ఎస్.మద్దిలేటి, ఎండి.యూనుస్, కె. మధుసూదన్, ఎం విజయ్ కుమార్ మహమ్మద్ అనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

చిన్నారిపై లైంగిక దాడి

- ఫోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - కౌతాళం

మనుమరాలి వయస్సున్న నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు ఓ మానవ మృగం. ఈ విషాదకర సంఘటన కౌతాళం పోలీసు స్టేషన్ పరిధిలోని చూడి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. చూడి గ్రామంలో దళిత కుటుంబంలో దంపతులకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. ఇంటి దగ్గరలోనే ఉన్న వ్యక్తి పిల్లలను ఆడిస్తూ.. పిల్లల తల్లిదండ్రులతో చనువుగా ఉండేవాడు పెద్దమారెప్ప. సోమవారం నాలుగేళ్ల చిన్నారికి బజ్జీలు కొనిస్తానని చెప్పగా తల్లి వద్దని చెప్పింది. కొద్దిసేపటికి కన్నతల్లి బట్టలు పిండడానికి వెళ్లగా, ఆ వ్యక్తి చిన్నారిని కొట్టంలోకి తీసుకెళ్లి లైంగిక దాడికిపాల్పడ్డాడు. చిన్నారి కేకలు వేయడంతో తల్లి పరిగెత్తుకు వచ్చి పాప పరిస్థితిని గమనించి ఒక వైద్యుని వద్ద తీసుకెళ్లగా అసలు విషయం బయటపడింది. కౌతాళం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ అశోక్ కుమార్ తెలిపారు.

విచారించి న్యాయం చేస్తాం...

- ఎస్‌పి విక్రాంత్‌పాటిల్
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 102 ఫిర్యాదులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను చట్టపరంగా విచారించి న్యాయం చేస్తామని కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అన్నారు. కర్నూలు కొత్తపేటలోని కర్నూలు టూటౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో ఆయన సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 102 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అడిషనల్ ఎస్‌పి హుస్సేన్ పీరా, సిఐ శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

బాల్య వివాహాలను అరికట్టాలి

జిల్లా కలెక్టర్ రంజిత్ బాష

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టాలని, అందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా జిల్లా కలెక్టర్ అధికారులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్యవివాహాలు ఒక సాంఘిక దురాచారం, నేరం అని తెలిపారు. బాల్య వివాహాల వల్ల బాలికల విద్యా, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని తెలిపారు. అంతకు ముందు 'ఆడపిల్లను రక్షిద్దాం – ఆడపిల్లను చదివిద్దాం' అనే నినాదంతో ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ ఫ్లెక్సీపై జిల్లా కలెక్టర్ సంతకం చేసి, కలెక్టరేట్ ఆవరణ లో మొక్కలు నాటారు.

నాటుసారాను సమూలంగా నిర్మూలించాలి

జిల్లాలో నాటుసారాను సమూలంగా నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాటుసారా నిర్మూలనా కార్యక్రమం 'నవోదయం 2.0' పై రూపొందించిన పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు.

గ్రీవెన్స్ వెంటనే పరిష్కరించాలి

పిజిఆర్ఎస్‌లో వచ్చిన గ్రీవెన్స్ వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ద్వారా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పిజిఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలన్నారు. రీఓపెన్ అయిన అర్జీలపై కూడా ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గడువు లోపు అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పిజిఆర్ఎస్ కి సంబంధించి వచ్చిన అర్జీలు సక్రమంగా పరిష్కారం అయ్యాయా లేదా అని ఆయా శాఖల జిల్లా అధికారులు ఆడిట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సిఎంఒ గ్రీవెన్స్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

కలెక్టరేట్‌లో అపరిశుభ్రతపై ఆగ్రహం

కలెక్టరేట్ లో ఉన్న ఆయా కార్యాలయాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉంచక పోవడంపట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఆయా కార్యాలయాల కిటికీల్లో నుండి ఖాళీ వాటర్ బాటిల్స్, టీకప్పులు బయటికి పడేసి పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛాంధ్ర స్వచ్ఛతా దివస్ కార్యక్రమాలను నిర్వహించుకుని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెబుతుంటే కలెక్టరేట్‌ను శుభ్రంగా ఉంచుకోకపోతే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత హెచ్ఓడిల మీద ఉందన్నారు. అపరిశుభ్రంగా ఉంచిన కార్యాలయాల హెచ్ఓడిలకు షో కాజ్ నోటీసులు జారీ చేయాలని, ఇలాగే కొనసాగితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఆయా కార్యాలయాల వద్ద చెత్త వేయడానికి పెద్ద పెద్ద బకెట్ లు ఏర్పాటు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని డిఆర్ఒను ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఇళ్ల స్థలాల కోసం పోరుబాట

కల్లూరు అర్బన్ మండలం పెద్దపాడు గ్రామ సమీపంలో సుమారు 2 వేల మంది పేదలు పోరుబాట నిర్వహించారు. పేదలు సిపిఎం ఆధ్వర్యంలో ఎర్రజెండాలు చేతపట్టి ప్రభుత్వ పోరంబోకు భూమిలో జెండాలు పాతి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ భూములు కాస్త రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పాలకుల అనుచరులకు, అనుంగు శిష్యులకు పప్పుల బెల్లంలా పంచిపెడుతున్నారు. విసిగి వేసారిన ఇల్లు లేని బక్క జీవులు మండుటెండను సైతం లెక్కచేయకుండా, తిండిమాని, చంటి బిడ్డను చంకనేసుకుని, స్థలం కోసం ఎర్రజెండా నీడన చీమలదండై కదిలారు. ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు కదిలొచ్చి స్థలాలు కేటాయిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించి వెనుదిరిగారు.

వార్త మెయిన్‌లో

ఇంటర్ పరీక్షల్లో పదిమంది డీబార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షల్లో పదిమంది విద్యార్థులు మాస్ కాపీయింగ్ పాల్పడుతూ డీబార్ అయ్యారు. సోమవారం ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు మొత్తం20506 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 20160 మంది విద్యార్థులు రాశారు. 336 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. పత్తికొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆరుగురు విద్యార్థులు మోడల్ స్కూలు కేంద్రంలో ఒకరు మాస్ కాపీ పాల్పడుతూ డీబార్ అయ్యారని ఆర్ఐఒ ఎస్‌విఎస్ గురువయ్యశెట్టి వెల్లడించారు. గోనెగండ్ల ఎమ్మిగనూరు పరీక్షా కేంద్రంలో ఇద్దరు, కర్నూల్ లోని నన్నూరు నారాయణ కళాశాల కేంద్రంలో ఒకరు డీబార్ అయ్యారన్నారు.

కెఎంసి పిజి విద్యార్థులకు రాష్ట్రస్థాయి ఉత్తమ ర్యాంకులు

అభినందించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు మెడికల్ కాలేజీ పిజి విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కర్నూల్ మెడికల్ కాలేజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతున్న వైద్యులు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన పిజి చివరి సంవత్సరం ఫలితాలలో కర్నూల్ మెడికల్ కాలేజీ పిజి విద్యార్థులు వివిధ డిపార్టుమెంట్స్ నుండి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపరచడం పట్ల కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ ఆయా విభాగాల్లో స్టేట్ ర్యాంక్ సాధించిన విద్యార్థులను, విభాగాధిపతులను, అధ్యాపక బృందాన్ని అభినందించారు. కర్నూలు మెడికల్ కాలేజీకి ఎంతో ఘనమైన చరిత్ర ఉందని, ఇలా రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడం ద్వారా కాలేజీ పేరును కొనసాగించినట్లు అవుతుందని ప్రిన్సిపల్ అన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని యుజి, పిజి విద్యార్థులు రాబోయే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని కోరారు. జనరల్ సర్జరీ విభాగంలో డాక్టర్ విష్ణు శేఖర్ రెడ్డి (స్టేట్ ఫస్ట్ ర్యాంకు), డాక్టర్ తేజేశ్వర్ రెడ్డి (స్టేట్ సెకండ్ ర్యాంక్) డాక్టర్ శివ నాగ జ్యోతి(స్టేట్ థర్డ్ ర్యాంక్) లు సాధించారు. ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ విభాగం లో డా అభినయ్(స్టేట్ ఫస్ట్ ర్యాంక్), మైక్రోబయాలజీ విభాగములో డాక్టర్ వైష్ణవీ (స్టేట్ సెకండ్ ర్యాంక్), పెథాలజీ విభాగంలో డాక్టర్ హిమ బిందు (స్టేట్ ఫస్ట్ ర్యాంక్ - థియరీ), ఆనాటమీ విభాగంలో డాక్టర్ జోసిలిన్ పొనుగూరి (స్టేట్ 3వ ర్యాంక్), ఫార్మకాలజీ విభాగం లో డాక్టర్ శివ రంజని (థియరీ - స్టేట్ ఫస్ట్ ర్యాంక్,), కమ్యూనిటీ మెడిసిన్ విభాగం లో డాక్టర్ అయేషా,(స్టేట్ 4వ ర్యాంక్) డాక్టర్ హారిక (స్టేట్ 5వ ర్యాంక్) లు సాధించారు.

మహిళలకు ఉచిత వైద్యం

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

కోడుమూరు పోలీస్‌స్టేషన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవారోత్సవాల్లో భాగంగా జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కోడుమూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎపి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కోడుమూరు కోలోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మదన్ శేఖర్ మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఇంటిలోని వ్యక్తులందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. తద్వారా ప్రజలు సామాజిక, ఆర్థిక సమస్యలు ఉండవని తెలిపినారు. వైద్యాధికారి డాక్టర్ మదన్ శేఖర్ మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధుల , క్యాన్సర్ పరీక్షల కార్యక్రమంలో భాగంగా ప్రతి 18 సంవత్సరాలు దాటిన మహిళలందరికీ ఉచిత రొమ్ము, నోటి, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ పరీక్షలు , బిపి, షుగర్ హిమోగ్లోబిన్ పరీక్షలు ఆరోగ్య కార్యకర్తలు ఇంటి వద్దకే వచ్చి ఉచితంగా పరీక్ష చేస్తారని అన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. ఎఎస్ఐఐ దుర్గాదేవి, ఆరోగ్య విస్తరణ అధికారి నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్ సాహెబ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రభావతి, ఆరోగ్య కార్యకర్త నాగమణి, సంచార చికిత్స కార్యక్రమం సిబ్బంది ఆశా కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు .

దోభీపోస్టులను భర్తీ చేయాలి

రజకవృత్తిదారుల నగర మహాసభలో గురుశేఖర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జీవో నంబరు 27 ప్రకారం వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న దోభీ పోస్టులు భర్తీ చేయాలని, రజకులకు ఇస్తానన్న 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ను వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి. గురు శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం న్యూ సిటీ ఆరవ మహాసభ కార్మిక కర్షక భవనంలో సి.రాముడు అధ్యక్షతన నిర్వహించారు. సి. గురుశేఖర్, సిఐటియు న్యూ సిటీ నగర కార్యదర్శి సిహెచ్ సాయిబాబా మాట్లాడుతూ జిఒ నంబర్ 27 ప్రకారం వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న దోభీ పోస్టులను భర్తీ చేసి రజక కుటుంబాల్లో ఉన్న యువతీ యువకులకు ఉపాధి కల్పించాలన్నారు. రజక కార్పొరేషన్‌కు కనీసం రూ.1000 కోట్ల బడ్జెట్‌లో కేటాయించి కార్పొరేషన్ ద్వారా 90 శాతం సబ్సిడీతో ప్రతి రజక కుటుంబానికి రూ5 లక్షల రుణాలు ఇవ్వాలని కోరారు. సిటీ, పట్టణ కేంద్రాల్లో మోడ్రన్ దోభీ గాట్లను ఏర్పాటు చేయాలని, జిఒ నెంబర్ 26 ప్రకారం కలెక్టర్లు చైర్మన్లుగా రజక సంక్షేమ కమిటీలు ఏర్పాటు చేసి రజకుల సమస్యల చర్చించాలన్నారు. ఇల్లు లేని రజక వృత్తిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇల్లు కట్టి ఇవ్వాలన్నారు. విశ్వకర్మ కౌచర్ల యోజన పథకం ప్రభుత్వ అధికారుల ద్వారా వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, దేశం మొత్తం రాష్ట్రంలో కులగణన చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేసే విధంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఓల్డ్ సిటీ అధ్యక్షులు జయమ్మ, చిన్న వ్యాపారస్తుల సంఘం నగర కార్యదర్శి మహమ్మద్‌రఫీ పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని 34 మందితో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సిహెచ్ శ్రీనివాసులు, అధ్యక్షుడిగా సి.రాముడు, ప్రధాన కార్యదర్శిగా సి.శేషాద్రి, ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, కర్రెన్న మద్దిలేటి రమణ సహకార దర్శులుగా చంద్రన్న, బాబు, కురుమూర్తి, పద్మ, రేణుకను, నూతన కార్యదర్శి వర్గంగా ఏకగ్రీవంగా మహాసభ ఎన్నుకుంది. ఈ మహాసభలో సుంకన్న ,మధు, లక్ష్మన్న, వీరేష్ మరో వంద మంది పాల్గొన్నారు.

రజకవృత్తిదారుల నగర మహాసభలో మాట్లాడుతున్న గురుశేఖర్

ఈ రోడ్లు బాగుపడేనా..?

అధ్వానంగా బురుజుల నుండి మద్దికేర రోడ్డు

పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి-మద్దికేర

రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా రోడ్లు అధ్వానంగా ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు పత్తికొండలో అమలు కావడం లేదు. రోడ్ల మరమ్మతులకు కోట్లాది రూపాయలు ఖర్చు చేశామని ఆర్భాటంగా చెబుతున్నా ప్రధానమైన కర్నూలు నుంచి అనంతపురం జిల్లా గుంతకల్లుకు వెళ్లే రహదారిలో బురుజుల నుంచి మద్దికేర వరకు రోడ్డు చాలా అధ్వానంగా ఉంది. ఈ రోడ్డు ఆర్‌టిసి బస్సు డిపో డ్రైవర్లు కూడా బస్సు సర్వీసులో నడపాలంటే హడలిపోతున్నారు. పత్తికొండ నుంచి గుంతకల్లుకు నిత్యం పత్తికొండ, కర్నూలు, గుంతకల్లు, బస్సులు, నడుపుతున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసాపురం ఆంజనేయస్వామి ఆలయం ఉండడంతో ఎప్పుడు రద్దీగా ఉంటుంది.

అధ్వానంగా రహదారి

బురుజుల నుంచి మద్దికేర వరకు అడుగడుగునా గుంతలు పడ్డాయి. కొన్ని ప్రాంతంలో రోడ్డు పూర్తిగా చిద్రంఅవడంతో కంకర తేలింది. ఈ కంకరరోడ్డుపై ద్విచక్ర వాహన దారులు ప్రాయాసతో ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఈ రహదారిపై బస్సు డిపో మేనేజర్లు కూడా బస్సు నడిపేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిలో ద్విచక్ర వాహనదారులు ఎంతోమంది తీవ్రంగా గాయపడ్డారు. ఒక ప్రభుత్వ ఉద్యోగి మరణించారు.

బురుజుల నుంచి గుంతకట్లు రోడ్డు

ఐదేళ్లుగా నరకయాతన...

బురజుల నుంచి మద్దికేరకు రోడ్డు చిధ్రమై గుంతలు పడి ఐదేళ్లవుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డు పరిస్థితిపై పలు పత్రికల్లో కథనాలు వచ్చిన అధికార యంత్రాంగంలో మాత్రం చలనం లేదు. ప్రజా ప్రతినిధులు పత్తికొండ నుంచి మద్దికేరకు వెళ్లాలంటే బురుజుల మీద వెళ్లాలంటే జంకుతున్నారు. మద్దికేరలో కార్యక్రమం ఉంటే తుగ్గలి పెరవలి గ్రామాల మీదుగా మద్దికేరకు చేరుకుంటారు. ప్రజా ప్రతినిధులు ప్రత్యక్షంగా రోడ్డు పరిస్థితులు చూస్తున్న పట్టించుకోకపోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డును బాగు చేయండి : చౌక్కా సునీల్ కుమార్

పత్తికొండ నుంచి మద్దికేర కు వెళ్లే రహదారిలో బురుజుల నుంచి మద్దికేరకు రోడ్డు అధ్వానంగా ఉంది. మోటార్ సైకిల్ పై వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందిగా ఉంది. ఎన్నో ఏళ్లగా ఉన్న ఈ సమస్యను పట్టించుకునే నాధుడే లేడు.

ఈ రోడ్డును మరమ్మతు చేయాలి

సిఐటియు మండల కార్యదర్శి రాముడు

బురుజుల నుండి మద్దికేర వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. ఎన్నో ఏళ్లగా ఇలాంటి పరిస్థితి ఉన్న పాలకులు పట్టించుకోకపోవడం దారుణం. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలను సమీకరించి ఆందోళన చేస్తాం. ఇప్పటికైనా స్పందించి పాలకులు రోడ్డును మరమ్మతు చేయాలి.

శ్రీలేఖ కుటుంబానికి రూ5 లక్షల ఎక్స్‌గ్రేషియా

సంతాపం తెలిపిన కోడుమూరు ఎమ్మెల్యే

ప్రజాశక్తి- సి బెళగల్

విద్యార్థిని శ్రీలేఖ మృతి పట్ల కుటుంబానికి కోడుమూరు ఎమ్మెల్యే దైర్యం చెప్పారు. ఆమెమృతి తీరని లోటు అని బాధను వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే ఎక్స్‌గ్రేసీయా కింద రూ.ఐదు లక్షలు చెక్కును అందజేశారు. అంతేకాకుండా పాఠశాల సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని హామీయిచ్చారు. పోలకల్ హైస్కూల్‌లో చెట్టు విరిగి కొమ్మలు విద్యార్థుల మీద పడిన ఘటనలో శ్రీలేఖ మృతి పట్ల కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సోమవారం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి మౌనం పాటించారు. అసెంబ్లీలో ఉన్న ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ఘటనపై స్పందించి పాఠశాలకు చేరుకొని ఘటనపై ఆరా తీశారు. అనంతరం డిఇఒ శామ్యూల్ పాల్, ఎపిసి శ్రీనివాసులుల సమక్షంలో బాలిక చిత్ర పటానికి నివాళులు అర్పించి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తీవ్ర గాయలైన బాలిక మూడు రోజుల అనంతరం కోలుకోలేక మతి చెందడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ జడ్‌పిటిసి చంద్రశేఖర్, మాజీ మండల కన్వీనర్ చిన్న తిమ్మప్ప, అమర్ పాల్గొన్నారు.

వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలి

కల్లూరు తహశీల్దార్‌కు యుజెఎఫ్ వినతి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మం డల వ్యాప్తంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో విధులు నిర్వహిస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం (యుజెఎఫ్) జిల్లా నాయకులు నీలం సత్యనారాయణ, పరమేష్, విజయ్ కుమార్, కల్లూరు మండల అధ్యక్షులు మధు సూదన్ లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం యుజెఎఫ్ ఆధ్వర్యంలో కల్లూరుతహసీల్దార్ కె. ఆంజనేయులుకు వినతిపత్రం అందచేశారు. వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా విధులు నిర్వహిస్తూ, జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారని అన్నారు. అలాంటి వారిలో కొంతమంది జర్నలిస్టులకు సొంత ఇళ్ళు లేక, ఏళ్ళ – తరబడి అద్దె ఇళ్ళలో నివాసం ఉంటున్నట్లు చెప్పారు. వారికి చాలిచాలని ఆదాయంతో సొంత ఇంటి కలను నెరవేర్చుకోలేకపోతున్నారు. యుజెఎఫ్ మండల నాయకులు, అద్యక్షులు జి. మధు సూదన్ కార్యదర్శి లోకేశ్, కోశాదికారి జర్నలిస్టులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న యుజెఎఫ్ నాయకులు

అర్జీలను నాణ్యతగా పరిష్కరించండి

- ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టంలో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా నాణ్యతగా పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టంలో సబ్ కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ... మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాసరాజు, వేణు సూర్య, డివిజనల్ సర్వేయర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ వర్షిణ, డిప్యూటీ డిఇఒ వెంకటరమణారెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ సత్యవతి, డిప్యూటీ తహశీల్దార్లు గుండాల నాయక్, వలీబాష పాల్గొన్నారు.

వివరాలు నమోదు చేయాలి

- మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణ

మ్యాపింగ్ కాని వారి పేర్లను సేకరించి వారి వివరాలను నమోదు చేయాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో విఆర్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని మున్సిపాలిటీ పరిధిలో 991 మంది సిటిజన్స్ వివరాలు చూపడం లేదన్నారు. వారి ఫోన్ నెంబర్లు సేకరించి రెండు నెలల్లోపు అప్‌డేట్ చేయాలని తెలిపారు. మై గ్రేట్, డెత్‌పై విచారించి ఆధారాలు చూపితే అలాంటి వారి పేర్లను తొలగించాలని చెప్పారు. పట్టణంలో 42 వార్డులకు గాను 8 మంది సచివాలయ విఆర్‌ఒలు విధులు నిర్వహిస్తున్నారని, మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సేవలు అందించాలని సూచించారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నిరసన తెలియజేస్తున్న కార్మికులు

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని, ఈనెల 5న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. సోమవారం ఉదయం క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జె.నాగరాజు, కె.ఇస్మాయిల్, సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు మాట్లాడారు. 20 ఏళ్ల నుంచి పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులు పనిచేస్తున్నారని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని గత ప్రభుత్వం పాదయాత్రలో హామీఇచ్చిందని, అప్పటి ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చి విస్మరించారని విమర్శించారు. నేడు కూటమి ప్రభుత్వం హామీఇచ్చి 9 నెలలు గడుస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు కె.సల్మాన్, కె.ఖాజా, బి.రంగస్వామి, పౌలు రాజు, శాంతిరాజు, బి.మునీంద్ర, శైలజ దేవి పాల్గొన్నారు.

ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయం చేయాలి

- ఎపిఎం సత్యమ్మ

ప్రజాశక్తి - కోసిగి

ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలని, ఆరోగ్యకరమైన పంటలు పండించాలని, సేంద్రీయ ఎరువుల వాడకం తగ్గించాలని ఎపిఎం సత్యమ్మ తెలిపారు. సోమవారం స్థానిక స్త్రీ శక్తి భవనం ముందు కోల్మన్ పేట గ్రామ యూనిట్ రైతులు ప్రకృతితో పండించి కూరగాయల స్టాల్ ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల ఉపయోగాలను తెలియజేశారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన రైతులకు సేంద్రీయ ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయంతో ఎలా కూరగాయలు పండించాలో అవగాహన కల్పించారు. సిసిలు నారాయణ, స్రవంతి, ఎంసిఆర్‌పి రాజ్యం, ఐసిఆర్‌పి ఎం.హనుమంతు, కృష్ణయ్య, నాగరాజు, ఐసిఆర్‌పి భీమిరెడ్డి పాల్గొన్నారు.

కూరగాయాల స్టాల్స్ ఏర్పాటు చేసిన రైతులు

అందని 'ఉపాధి' కూలి

- 8 వారాలు గడిచినా అందని వేతనాలు
- వేతనాలు రాక పొలాల బాట పట్టిన కూలీలు

ప్రజాశక్తి - నందవరం

ఉపాధి పనులు చేసిన కూలీలకు వేతనాలు సరిగ్గా అందడం లేదు. 8 వారాలుగా వేతనాలు అందకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. వేతనాలు రాకపోవడంతో కొంతమంది ప్రజలు పొలం బాట పట్టారు. మరి కొంతమంది వలసలు వెళ్లటానికి సిద్ధమయ్యారు.

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

నందవరం గ్రామంలో ఉపాధి పనులు మొదలుపెట్టి 8 వారాలు కావస్తోంది. 7 వారాల పనులు పూర్తయినా ఒక్క వారం బిల్లు కూడా అందలేదు. కూలి ఆధారంగా జీవనాన్ని కొనసాగిస్తున్న నిరుపేద కుటుంబాలు వేతనాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ప్రజలు వలసలు వెళ్లకుండా అధికారులు ఉపాధి కల్పించి వలసలను కొద్ది వరకు అరికట్టారు. అధికారులను వేతనాలు అడిగితే 'కచ్చితంగా వస్తాయ్. బిల్లు పెట్టాం' అని చెబుతున్నారు. వేతనాలు రావడం లేదు. అధికారులు చెప్పిన మేరకు చాలామంది వ్యక్తులు వలసలు వెళ్లకుండా ఉపాధి బాట పట్టారు. ఎస్సీ కాలనీ సుమారు 13 ఏళ్లు ఉపాధి పనులు నిలిచిపోయాయి. అధికారుల చొరవతో ఈసారి ఉపాధి హామీ పనులను ఎస్సీ కాలనీకి చెందిన ప్రజలు వినియోగించుకుంటున్నారు. వేతనాల ఆలస్యం కావడంతో వలసల నియంత్రణపై అధికారుల చేసిన ప్రయత్నం వృథా అయ్యేలా ఉంది. ఇప్పటికే కొంతమంది ప్రజలు ఉపాధి పనులు వదిలి పొలం బాట పట్టారు. కొంతమంది వలసలు వెళ్లడానికి సిద్ధమైనట్లు తెలిసింది. ప్రభుత్వం వేతనాలను చెల్లించడంలో నిర్లక్ష్యం కొనసాగిస్తే వలసలు పెరిగే అవకాశం ఉంది.

కుటుంబ పోషణ కష్టంగా మారింది

- పకీరప్ప,నందవరం

మాది నిరుద్యోగ కుటుంబం. కూలి వెళితేనే కుటుంబం గడుస్తుంది. ఉపాధి హామీ పనులకు వెళ్లినా ఇప్పటివరకు వేతనాలు రాలేదు. కుటుంబ పోషణకు అప్పులు చేస్తున్నాం. ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. కుటుంబ పోషణకు, ఆరోగ్య సమస్యలను తీర్చుకోవడానికి కష్టంగా మారింది.

అప్పుల భారం పెరిగింది

- సోమన్న, నందవరం

అధికారులు చెప్పిన ప్రకారం ఈసారి వలసలకు వెళ్లకుండా, రూ.350 వచ్చే పొలం పనులు, మిరపకు వెళ్లకుండా ఉపాధి హామీ పనులకు వెళ్తున్నాం. ప్రతేడాది వలసలకు వెళ్లి అప్పులు కట్టుకునే వాళ్లం. ఉపాధి హామీ పనులకు వెళ్లడం వల్ల వేతనాలు రాక కొత్తగా అప్పులు చేయడంతో అప్పుల భారం మరింత పెరిగింది.

కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలి

- కెవిపిఎస్ మండల కార్యదర్శి హనుమంతు

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని శ్మశానంలో గుంతలు తీసి, మృతదేహాలను పూడ్చి, కాల్చే కాటికాపరుల సమస్యలను పరిష్కరించాలని కెవిపిఎస్ మండల కార్యదర్శి హనుమంతు కోరారు. సోమవారం సిఐటియు నాయకులు రాముడు, వీరేష్ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అన్ని వృత్తులనూ గుర్తించి సహకారం అందిస్తున్న పాలకులు కాటికాపరులను ఎందుకు గుర్తించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

వినతి పత్రం ఇస్తున్న కాటికాపరులు, సిఐటియు నాయకులు

తాతల, ముత్తాతల కాలం నుంచి చేస్తూ వస్తున్న వృత్తికి ఎలాంటి ఆదరణా, గుర్తింపును ప్రభుత్వం ఇవ్వడం లేదని వాపోయారు. వృత్తిని కొనసాగించే క్రమంలో అనేక రకాల అవమానాలు పడుతున్నారని తెలిపారు. నేటికి హక్కులు లేని వారిగానే ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం స్పందించి కాటికాపరులకు గుర్తింపు కార్డులిచ్చి, 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. వారికి రూ.8 వేల పింఛను ఇవ్వాలని, ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ రుద్రగౌడ్‌కు, ఎంపిడిఒ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు జేజప్ప, ఈరన్న, ఫిలిప్, ప్రకాష్, నరసయ్య పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి ప్రభుత్వ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రాలను తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, ఎమ్మిగనూరు నుంచి వచ్చిన ప్రత్యేక అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. ఇక్కడ మాస్ కాపీయింగ్ జరగకుండా సిసి కెమెరాలను ఏర్పాటు చేయించామని తెలిపారు. విద్యార్థులకు తాగునీటి వసతి, ఏదైనా అనారోగ్య పరిస్థితులు కనిపిస్తే ఒక ఎఎన్ఎంను ఏర్పాటు చేశామన్నారు. కళాశాల బయట పోలీసు సిబ్బంది ఉన్నారని చెప్పారు. రెవెన్యూ కార్యదర్శి గోవిందప్ప, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చెట్నిహళ్లి గ్రామంలో శ్మశాన వాటిక విషయంలో ఇరు వర్గాల మధ్య చెలరేగిన వివాదంలో 50 మందిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ చేపట్టారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెట్నిహళ్లి గ్రామంలో శ్మశాన వాటిక గురించి గ్రామంలో ఉన్న ఎస్సీలు అక్కడ శ్మశాన స్థలాన్ని మార్చాలని అడ్డుకున్నారని, ఈ ఘటనలో ముందస్తు చర్యల్లో భాగంగా సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రహదారులు అధ్వానం

- సమస్య పరిష్కారంలో ప్రభుత్వం విఫలం
- ఎంపిడిఒ కార్యాలయం ఎదుట డివైఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి- దేవనకొండ

గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని డివైఎఫ్ఐ నాయకులు మండిపడ్డారు. సోమవారం డివైఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అంతకుముందు స్థానిక బస్టాండ్ నుంచి ఎంపిడిఒ కార్యాలయం వరకు డివైఎఫ్ఐ కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు ర్యాలీ నిర్వహించారు. డివైఎఫ్ఐ మండల నాయకులు పెద్దయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాసులు, వ్యకాస మండల కార్యదర్శి మహబూబ్ బాషా, సిఐటియు మండల కార్యదర్శి అశోక్ మాట్లాడారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ధ్వంసమైన రోడ్లను కొత్తగా వేయడంలోనూ, మరమ్మతులు చేపట్టడంలోనూ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మండలంలోని రోడ్లు పూర్తిగా ధ్వంసమై రవాణాకు, రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉన్నా పాలకులు పట్టించుకోవడం లేదని తెలిపారు. రోడ్లకే తమ ప్రాధాన్యత అని చెప్పిన కూటమి ప్రభుత్వం అమలులో వెనకబడిందని విమర్శించారు. మండలంలోని రోడ్ల నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదికన కృషి చేయాలని డిమాండ్ చేశారు. దేవనకొండ, ఇతర ప్రధాన ప్రాంతాలకు మండలంలోని 44 గ్రామాల నుంచి రవాణా సౌకర్యం అస్తవ్యస్తంగా ఉందని తెలిపారు. ప్రధానంగా ఈదుల దేవరబండ నుంచి బేతపల్లి, బండపల్లి రోడ్డు దశాబ్ద కాలంగా నూతన నిర్మాణానికి, మరమ్మతులకు నోచుకోకపోవడంతో రవాణా సౌకర్యానికి ఆటంకంగా, తీవ్ర ఇబ్బందికరంగా మారిందని చెప్పారు. కప్పట్రాళ్ల – నెల్లిబండ – బండగట్టు రోడ్డు పూర్తిగా ధ్వంసమైనా ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని తెలిపారు. మండలంలో పెద్ద గ్రామమైన తెర్నేకల్‌కు వెళ్లాలంటే పుల్లాపురం నుంచి వాహనదారులకు చుక్కలు కనపడతాయని, కరివేముల నుంచి తెర్నేకల్ మీదుగా బైలుప్పల వరకు రోడ్డు అధ్వాన పరిస్థితిలో ఉందని చెప్పారు. దేవనకొండ – పల్లెదొడ్డి– జిల్లేడు బుడకల–మాదాపురం రోడ్డు ప్రయాణికులకు అసౌకర్యంగా, ప్రమాదాలకు నిలయంగా ఉందని తెలిపారు. గుండ్లకొండ నుంచి బంటుపల్లి రోడ్డు, కరివేముల, జిల్లేడు బుడకల రోడ్డు, కుంకనూరు పొట్లపాడు రోడ్లు దారుణంగా ఉన్నాయని చెప్పారు. మండలంలోని రోడ్ల నిర్మాణం చేపట్టాలని, అందుకు నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం ఇన్‌ఛార్జీ ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. డివైఎఫ్ఐ, ప్రజాసంఘాల నాయకులు యూసుఫ్ బాషా, బజారి, శ్రీనివాసులు, సుధాకర్, రవీంద్ర, లోకయ్య, రమేష్, బలరాముడు, మహేష్, రంగడు, రాము, రాయుడు, రాముడు, బండ్లయ్య, తెర్నేకల్, కుంకనూరు, పొట్లపాడు, బండగట్టు ప్రజలు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

'అర్హులకు ఇళ్ల స్థలాలివ్వాలి'

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని అర్హులైన నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని సిపిఎం మండల కార్యదర్శి హెచ్.జయరాజు, నాయకులు బి.అనిల్ కోరారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎస్.రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. మంత్రాలయంలో చాలా మంది పేదలకు ఇంటి స్థలాలు లేక ఇల్లు లేక అద్దె ఇళ్లలో ఉంటున్నారని తెలిపారు. అలాంటి పేదలను గుర్తించి ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. టి.లక్ష్మన్న, దేవిపుత్ర, హనుమంతు పాల్గొన్నారు.

8 వారాలుగా 'ఉపాధి' పెండింగ్

- వేతనాలు చెల్లించాలి

- వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్

ప్రజాశక్తి- దేవనకొండ

ఉపాధి హామీ చట్టంలో 8 వారాలుగా చేసిన పనికి వేతనాలు అందకపోవడంతో కూలీలు ఇబ్బందులకు గురవుతున్నారని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, మండల కార్యదర్శి మహబూబ్ బాషా డిమాండ్ చేశారు. సోమవారం వ్యకాస మండల కమిటీ ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ, ఎపిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దాదాపు రెండు నెలలుగా పనులు చేసినా వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతకాలని ప్రశ్నించారు. ప్రభుత్వం, అధికారులు కూలీలకు వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి చర్యల ద్వారా ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. పెండింగ్ వేతనాలు, పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వ్యకాస మండల ఉపాధ్యక్షులు యూసుఫ్ బాషా, బజారి, గాజుల శ్రీనివాసులు, లక్ష్మిరెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి అశోక్, సుధాకర్, రవీంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'కాంక్రీట్ ప్లాంట్ తొలగించాలి'

ప్రజాశక్తి - ఆదోని

అనుమతులు లేకుండా రెడీ మిక్స్ కాంక్రీట్ ప్లాంట్‌ను తొలగించి, నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు వీరేష్, కార్యదర్శి నాగరాజు, నాయకులు వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలో టిడ్కో గృహ సముదాయం దగ్గర ఎలాంటి అనుమతులూ లేకుండా రెడీ మిక్స్ కాంక్రీట్ ప్లాంట్ నిర్వహిస్తున్నారని, దీనివల్ల అక్కడ ఉండేవారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. టిడ్కో గృహాల నిర్మాణానికి అప్పట్లో రెడీ మిక్స్ కాంక్రీట్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. టిడ్కో గృహాల నిర్మాణానికి కాకుండా సంబంధిత కాంట్రాక్టర్ ప్రయివేట్ వ్యక్తుల బిల్డింగ్ నిర్మాణాలకు రెడీ మిక్స్ కాంక్రీట్ తయారు చేసి వ్యాపారం చేసుకుంటున్నారని తెలిపారు. ఈ ప్లాట్ నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా పొల్యూషన్ సర్టిఫికెట్, ఫ్యాక్టరీ లైసెన్స్, లేబర్ లైసెన్స్ లాంటివి తీసుకోకుండా వ్యాపారం చేసుకుంటున్నారని చెప్పారు. సంబంధిత అధికారులు విచారించి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న రెడీ మిక్స్ కాంక్రీట్ ప్లాంట్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

పనులు సక్రమంగా కల్పించిన వారినే

ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించాలి

- ఎపి కురుబ/కురుమ కార్పొరేషన్ డైరెక్టర్ ఉదయ్ కుమార్

ప్రజాశక్తి - ఆస్పరి

కూలీలకు ఉపాధి హామీ పనులు సక్రమంగా కల్పించే వారినే ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించాలని ఎపి కురుబ/కురుమ కార్పొరేషన్ డైరెక్టర్ కెసి.ఉదయ్ కుమార్ కోరారు. సోమవారం కర్నూలు నగరంలోని డ్వామా పీడీ వెంకటరామయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పనుల్లేక చాలా గ్రామాలు ఖాళీ అయ్యాయని, వలసలను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పనులు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పారు. పీడీ వెంకటరామయ్య మాట్లాడుతూ... గ్రామాల్లో వలసలను నివారించి ఉపాధి పనులు పెట్టేలా చూస్తామన్నారు. పనులు కల్పించని ఫీల్డ్ అసిస్టెంట్లపై విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జనసేన ఆస్పరి మండల అధ్యక్షులు అరవింద్ కుమార్, నాయకులు అంజి, ప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.

'న్యాక్'ను సద్వినియోగం చేసుకోండి

- కేంద్రం ఇన్‌ఛార్జీ ఉల్లిగన్న

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని న్యాక్ శిక్షణ కేంద్రంలో అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుకు ఈనెల 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని న్యాక్ శిక్షణ కేంద్రం ఇన్‌ఛార్జీ బిజి.ఉల్లిగన్న, నైపుణ్యాధికారి ఆనంద్ రాజ్ కుమార్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడారు. శిక్షణ కేంద్రంలో 90 రోజుల శిక్షణ కాలంలో ప్రాక్టికల్స్, థియరీ, కమ్యూనికేషన్స్ స్కిల్స్‌తో పాటు సర్టిఫికెట్ అందజేస్తామని చెప్పారు. అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుకు పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బిటెక్, ఎంబిఎ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, ఆర్ట్స్ కళాశాల రోడ్డు, ఎంపియుపి స్కూల్ 2వ బ్లాక్ టీచర్స్ కాలనీ ఆదోని సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ రాజశేఖర్ 9177413642, వీరేష్ 9397031486, అమృత్ కుమార్ 9989109688 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

'సోలార్' మాయమాటలు

- మోసపోతున్న రైతులు

- రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు

ప్రజాశక్తి - ఆలూరు

రైతుల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకొని సోలార్ కంపెనీలు మాయమాటలు చెబుతూ పొలాలను సొంతం చేసుకుంటున్నాయని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు, మండల కార్యదర్శి యు.ఈరన్న తెలిపారు. సోమవారం సోలార్ కంపెనీల నుంచి మోసపోయి భూములు కోల్పోవద్దని రైతుసంఘం ఆధ్వర్యంలో మండలంలోని కరిడిగుడ్డం, కురుకుంద, కమ్మరచేడు, ముసానహళ్లి, మరకట్టు, పెద్దహోతూరు, మొలగవల్లి, హత్తిబెళగల్, కురవల్లి గ్రామాల్లో జీపు జాతా నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలోని వెనుకబడిన నియోజకవర్గంలో రైతులు వర్షంపై ఆధారపడి జీవించడం, కరువు ప్రాంతం కావడం, వలసలతో గ్రామాలు వదిలిపోవడంతో గత్యంతరం లేక భూములు అమ్ముతారని, లీజుకు ఇస్తారని, ప్రభుత్వం సోలార్ కంపెనీలకు అనుమతులు ఇచ్చిందని తెలిపారు. ఇదే సాకుగా సోలార్ కంపెనీలు దళారులను పెట్టుకొని తక్కువ మొత్తంలో రైతుల నుంచి భూములను కొనుగోలు చేస్తున్నాయని, లీజుకు ఏడాదికి రూ.30 వేలు ఇస్తామని ఆశ చూపి అగ్రిమెంట్ చేసుకుంటున్నాయని చెప్పారు. వీటి వెనుక పెద్ద మోసం ఉందని, రైతులకు షరతులేవీ వివరించకుండా తక్కువ ధరకే భూములు కొట్టేస్తున్నారని తెలిపారు. సోలార్ కంపెనీలకు భూములు విక్రయించడం, లీజుకు ఇవ్వడం మంచిదా కాదా అనే విషయాలపై రైతులకు వివరించేందుకు ఈ నెల 6న ఉదయం 10 గంటలకు ఆలూరు గెస్ట్ హౌస్ ఆవరణలో రైతుసంఘం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గ రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. నాయకులు కెపి.నారాయణ స్వామి, కృష్ణ, ధనుంజయ, మైనా పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

కొత్త పైపులైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

- వైస్ ఛైర్మన్ నరసింహులు

ప్రజాశక్తి - ఆదోని

మరమ్మతులను పరిశీలిస్తున్న నరసింహులు

పట్టణంలో కాలం చెల్లిన తాగునీటి పైపులైన్ నిత్యం లీకేజీ ఏర్పడుతోందని, వాటి స్థానంలో కొత్త పైపులైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసేలా కౌన్సిల్ చొరవ చూపుతోందని మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు తెలిపారు. సోమవారం పట్టణంలోని భీమాస్ సర్కిల్ సమీపంలో తాగునీటి పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలించారు. నీటి పైపులైన్ ఏ మోతాదులో పగిలిందనే విషయాలను పనిచేసే కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పనులు నాణ్యతగా, సక్రమంగా చేపట్టాలని కార్మికులకు సూచించారు. పట్టణంలో అనేకచోట్ల తాగునీటి పైపులైన్లు రోజూ ఎక్కడో ఒకచోట పగిలిపోతున్నాయని, పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బంది తలెత్తుతోందని తెలిపారు. సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తతో అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలకు నీటి అవసరాలు మరింత అధికమవుతాయని, ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పట్టణంలో బలహీనంగా ఉన్న పైపులైన్లను అధికారులు గుర్తించి ముందస్తు మరమ్మతులు చేపడితే ప్రజలకు తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా ఉంటుందన్నారు. అవసరమైతే మున్సిపాలిటీ ఎజెండాలో కొత్త పైపులైను ఏర్పాటు అంశాన్ని ఉంచితే తాము ఆమోదిస్తామని, అధికారులు దృష్టిలో ఉంచుకోవాలని తెలిపారు. పట్టణంలో ఏళ్ల నాటి పైపు లైన్ నేటికీ కొనసాగిస్తున్నారని, కొత్తగా ఆలోచన చేయాలని చెప్పారు. అవసరమైతే నూతన పైపు లైన్ ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపి నిధుల మంజూరుకు కృషి చేయాలన్నారు. త్వరలోనే కౌన్సిల్‌లో చర్చించి నూతన పైపులైనుకు ప్రతిపాదనను సిద్ధం చేసేలా శ్రద్ధ తీసుకుంటామన్నారు.

వాటర్ ప్లాంట్‌కు విద్యుత్ కలెక్షన్ కట్

- ట్రాన్స్‌కో ఎఇ తీరుపై నేమకల్, సంగాల ప్రజల ఆగ్రహం

- తాగునీటి ఇబ్బందులతో లబోదిబోమంటున్న ప్రజలు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని నేమకల్లు పంచాయతీలో ఆర్ఒ వాటర్ ప్లాంట్‌కు విద్యుత్‌ను కట్ చేయడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఇరు గ్రామాల ప్రజలు మాట్లాడారు. నేమకల్లు పంచాయతీలో ప్రభుత్వం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిందన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ఈ ప్లాంట్ నుంచి పంచాయతీ అధికారులు తాగునీరు మినరల్ వాటర్ సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యుత్ బిల్లు కట్టలేదనే సాకుతో.. పంచాయతీ అధికారులు బిల్లు కడతామని చెప్పినా వినకుండా విద్యుత్ కట్ చేశారని తెలిపారు. విద్యుత్ కట్ చేయడంతో ఆర్ఒ మినరల్ వాటర్ ప్లాంట్‌కు తాగునీరు నిలిపేశారని చెప్పారు. గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా... డిమాండ్ నోటీసు పంపించారని, పంచాయతీ నుంచి బిల్లు కడతామని చెప్పినా వినకుండా ట్రాన్స్‌కో ఎఇ విద్యుత్‌ను తొలగించడం బాధాకరమని తెలిపారు. గ్రామస్తులు వెంటనే నేమకల్లు వాటర్ ప్లాంట్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే ట్రాన్స్‌కో ఎఇ తీరుపై ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఎఇని వివరణ కోరగా... విద్యుత్ బిల్లు చెల్లించనందుకు తొలగించినట్లు నిర్లక్ష్య సమాధానమిచ్చారు.

గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు

- ఇన్‌ఛార్జీ ఇఒఆర్‌డి బాలన్న

నేమకల్ గ్రామంలో వాటర్ ప్లాంట్‌కు విద్యుత్ తొలగించడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ఎఇకి పంచాయతీ నుంచి బిల్లు కడతామని చెప్పినా వినకుండా కనెక్షన్ తొలగించారు. ఇది చాలా బాధాకరం. పంచాయతీ నుంచి వాటర్ ప్లాంట్ ఉంది. బిల్లు చెల్లించాల్సిన బాధ్యత కూడా పంచాయతీకి ఉంది. కచ్చితంగా బిల్లు చెల్లిస్తాం. ఎఇ వినకుండా విద్యుత్ వ్యాపారం చేస్తున్నారు. గ్రామాల్లో విద్యుత్ వ్యాపారం చేసేటప్పుడు పంచాయతీలో కూడా చాలా చెల్లించాల్సి ఉంది. వినియోగదారుల నుంచి విద్యుత్ బిల్లు కట్టించుకుంటూ పంచాయతీలకు మాత్రం ఎలాంటి రుసుం చెల్లించడం లేదు.

సర్పాల సయ్యాట..!

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం గ్రామ సమీపంలో సర్పాల సయ్యాట కనుల విందు చేసింది. సోమవారం సుమారు 2 గంటలకు పైగా రెండు పాములు ఒక దానిపై ఒకటి పడుతూ.. లేస్తూ చేసిన నాట్యం, అక్కడున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు మళ్లీ మళ్లీ చూసేలా చేశాయి. పాముల సయ్యాటలు చాలా అరుదుగా జరుగుతుంటాయని చర్చించుకున్నారు. ఈ పాముల నాట్యాన్ని చూసిన వారందరూ ఆనందం వ్యక్తం చేశారు. పాముల విన్యాసాలు ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీసుకుని తమ మిత్రులకు షేర్ చేసుకున్నారు. ఫోన్ గ్రూపుల్లో వీడియోలు, ఫొటోలు హల్‌చల్ చేశాయి.

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం

- సిపిఎం నాయకుల బైఠాయింపు

ప్రజాశక్తి - దేవనకొండ

బైఠాయించిన సిపిఎం నాయకులు

మండలంలో రైతు సమస్యలను పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నాయకలు మండిపడ్డారు. అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సోమవారం వ్యకాస ఆధ్వర్యంలో సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, మండల కమిటీ సభ్యులు అశోక్, మహబూబ్ బాషాలు తహశీల్దార్ కార్యాలయంలో బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెర్నేకల్ గ్రామానికి చెందిన రైతు మాబాషకు 381/1 సర్వే నెంబర్‌లోని 7 ఎకరాల వ్యవసాయ పొలంలో 27 సెంట్లు హంద్రీనీవా కాలువ కింద పోయిందని తెలిపారు. మిగిలిన 6.63 ఎకరాలను పట్టాదారు పాసు పుస్తకంలో ఎక్కించాల్సి ఉందని, రీ సర్వే పేరుతో 6.30 ఎకరాలు మాత్రమే రెవెన్యూ రికార్డులో ఉందని చెప్పారు. ఇంకా 33 సెంట్లు రావాల్సి ఉందని, 33 సెంట్లు మరో రైతుకు ఎక్కించారని ఆవేదన వ్యక్తం చేశారు. 382–ఎ సర్వే నెంబర్‌లో 1.50 ఎకరాలకు గాను 50 సెంట్లు హంద్రీనీవా కాలువలోకి పోయిందని, 50 సెంట్లు పరిహారం ఇవ్వకుండానే ఆన్‌లైన్ రికార్డులో తొలగించారని, ఇది రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శమని విమర్శించారు. రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినా సమస్యను పరిష్కరించలేదన్నారు. సర్వేయర్, విఆర్ఒ నిర్లక్ష్యంతోనే రైతుకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. కార్యాలయంలో బైఠాయించిన సిపిఎం నాయకులతో జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున మాట్లాడుతూ... సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విరమించారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా సత్యన్న

ప్రజాశక్తి - కౌతాళం



బాలన్నను సన్మానిస్తున్న సిబ్బంది

ఇన్‌ఛార్జీ ఎంపిడిఒగా సత్యన్న సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎంపిడిఒగా పనిచేసిన సుబ్బరాజు విరమణ పొందారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్‌ఛార్జీ ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అందరి సహకారంతో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఇఒఆర్‌డి యోగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

నవోదయ 'జాతీయ యువ పార్లమెంట్'

ప్రజాశక్తి - ఎమ్మిగనూర్ రూరల్

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ పద్మావతి

మండలంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో సోమవారం 'జాతీయ యువ పార్లమెంట్' పథకం నిర్వహించారు. 7, 8వ తరగతి విద్యార్థులు పాల్గొని పార్లమెంట్‌లో జరిగే విధానంగా అధికార, ప్రతిపక్ష పార్టీలుగా విడిపోయి క్వశ్చన్ అవర్‌ను చక్కగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఇ.పద్మావతి మాట్లాడారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నవంబర్ 26, 2019న జాతీయ యువ పార్లమెంట్ పథకం వెబ్ పోర్టల్‌ను ప్రారంభించిందని తెలిపారు. దేశంలోని పౌరులు ఈ పోర్టల్‌లో పాల్గొనేలా ఎన్‌వైపిఎస్ 2.0ను ప్రవేశపెట్టబడిందని చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ కె.చందిరన్, ఎకె.బసవరాజ్, కె.వెంకటేశ్వర్లు (తెలుగు), శశికిరణ్, ఎ.రాజు, వెంకటేష్, రవిశంకర్, మీనాచంద్రన్ పాల్గొన్నారు.